క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలికి రూ.5 వేలందిస్తున్న అచ్చింనాయుడు

కె.కోటపాడు: చౌడువాడలో అగ్ని ప్రమాద బాధితురాలు గొంప కాంతంకు రూ.5 వేల సాయమందించారు. ఇటీవల అగ్నిప్రమాదంలో దుస్తులు, నిత్యావసర సరుకులు కాలిపోవడంతో ఆమె నిరాశ్రయురాలైంది. ఆమె ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న డేస్ ఫౌండేషన్ చైర్మన్ దొగ్గ అచ్చింనాయుడు గురువారం రూ.5 వేలందించారు. పేదరికానికి చెందిన అగ్నిప్రమాద బాధితురాలికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, మద్దాల నాగరాజు, మరిసా అప్పలనాయుడు, నాగేష్ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ సీఐగా కాంతికుమార్ బాధ్యతలు



నర్సీపట్నం: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టరుగా టి.కాంతికుమార్ బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన విజయనగరం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఎస్సైగా పనిచేశారు. ఉద్యోగోన్నతిపై నర్సీపట్నం టౌన్ సీఐగా నియమితులయ్యారు. గురువారం ప్రస్తుత సీఐ గణేష్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. గణేష్ ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఎస్సైలు సుధాకరరావు, మహేశ్వరరావు, సిబ్బంది నూతన సీఐకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తులసీరావు తొలి వర్ధంతికి తరలిన రైతులు



రమాకుమారితో పాడిరైతులు

మాడుగుల రూరల్: విశాఖ డెయిరీ చైర్మన్, దివంగత ఆడారి తులసీరావు తొలి వర్ధంతితో పాటు తీర్థం కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాలకు చెందిన పాల సొసైటీ అధ్యక్షులు, వేతన కార్యదర్శులు గురువారం యలమంచిలి తరలి వెళ్లారు. అక్కడ తులసీ ఘాట్ వద్ద తులసీరావు విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌బాబు, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారిని కలిశారు. కె.జె.పురం పాల సొసైటీ అధ్యక్షుడు యల్లపు శ్రీను, వేతన కార్యదర్శి బీ ప్రసాదు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం



బోరుకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు

గొలుగొండ: గుండుపాల పంచాయతీ అయ్యన్నకాలనీ సమీపంలో ప్రజలకు ఉపయోగార్థం తాగునీటి బోరును జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, ఎంపీటీసీ నూకరత్నం, సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడు పాని శాంతారాం గురువారం ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ.లక్షతో బోరు ఏర్పాటు చేసి తాగునీటి ఇబ్బందులు తొలగిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

బదిలీ అయిన తహసీల్దారుకు వీడ్కోలు సత్కారం



తహసీల్దార్ లక్ష్మిని సత్కరిస్తున్న భాస్కరరావు

దేవరాపల్లి: శ్రీకాకుళం జిల్లా కవిటి మండలానికి బదిలీ అయిన తహసీల్దార్ ఎం. లక్ష్మిని స్థానిక రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు ఆమెను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

అభాగ్యుల్లో ఆనందం



మాడుగుల: గిరిజనులకు పింఛన్లు అందజేస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ రాజారామ్



వారాడలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ గణేష్



బుచ్చెయ్యపేట: నేతవానిపాలెంలో వృద్ధురాలికి పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్ కొండలరావు

- వలంటీర్ల చొరవతో ఏకకాలంలో పింఛన్ల సొమ్ము పంపిణీ

చోడవరం: సామాజిక పింఛనుదారుల్లో ఆనందం వెల్లివిరిసింది. పింఛన్‌ను రూ. 3 వేల చొప్పున వలంటీర్లు గురువారం ఒక్క రోజులోనే 70 శాతం మేర పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చే సరికి రూ.2 వేలుగా ఉన్న పింఛన్‌ను దశల వారీగా పెంచుకుంటూ వెళతామని ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి అయ్యాక ఏటా రూ. 250 చొప్పున పెంచారు. ఈ ఏడాది గత నెల నుంచి రూ. 3 వేల చొప్పున ఇస్తున్నారు. ఈ పింఛన్ ఒకటో తేదీన పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి తెల్లారేసరికి వలంటీర్లు ఇవ్వడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. చోడవరం నియోజకవర్గంలో 46,248 మంది లబ్ధిదారులకు 13 కోట్ల 87 లక్షల 44 వేల రూపాయలు పంపిణీ చేశారు. చోడవరం మండలంలో 13,491 మంది, బుచ్చెయ్యపేటలో 10,953 మంది, రావికమతంలో 12,494 మంది, రోలుగుంటలో 9,310 మందికి పింఛన్ అందిస్తున్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

మాడుగుల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛను రూ.3 వేలు పెంచి మాట నిలబెట్టుకున్నారని ఆ సొమ్ముతో నిరుపేద గిరిజనులు ఆనందంగా జీవిస్తున్నారని ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. అవురువాడ పంచాయతీ శివారు గిరి గ్రామం పశువులబందలో గిరిజనులకు పింఛన్లు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూపాయి లంచం లేకుండా నేరుగా లబ్ధిదారులకు పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌దే అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు తంటపురెడ్డి బన్నీ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కింతలి వల్లాపురంలో అభివృద్ధి పనులు ప్రారంభం

కింతలి వల్లాపురంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ కేంద్రం, గొర్రిగెడ్డపై వంతెన, తదితర అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం ప్రారంభిస్తారని ఇన్‌చార్జి ఎంపీపీ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు హాజరు కావాలని కోరారు.

కె.కోటపాడు: మండలంలో 22 గ్రామ సచివాలయాల్లోను సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వేకువజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము ఇచ్చారు. కె.కోటపాడు, చౌడువాడ, వారాడ, ఆనందపురం, కొరువాడ, కింతాడ తదితర గ్రామాల్లో చురుగ్గా పింఛన్ల పంపిణీ జరిగింది. కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని 35 పంచాయతీల్లో వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించారు. గురువారం తెల్లవారు జాము నుంచి ఆయా గ్రామాల వలంటీర్లు తమకు కేటాయించిన 50 ఇళ్లలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, తదితర లబ్ధిదారుల ఇంటికెళ్లి వేలిముద్రలు, ఐరీష్ తీసుకుని పింఛన్ నగదు అందించారు.



లోపూడిలో వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ అనిత

తొలి రోజే మండలంలో 86 శాతం వరకు పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో సువర్ణరాజు తెలిపారు.



చోడవరం: చినబజార్‌వీధిలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీరు

సంక్షేమానికి చిరునామా... సీఎం జగన్ పాలన



వృద్ధురాలికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- కె.కోటపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

కె.కోటపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన వారికి సంక్షేమంతో అందరికి మేలు కలుగుతుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం కె.కోటపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి 54 నెలల పాలనా కాలంలో చేసిన మేలును ఆయన వివరించారు. ఈ సందర్భంగా తన ఇంటికే ప్రతి నెలా ఒకటో తేదీన తలుపుతట్టి పింఛన్ అందించడంతో ఆర్థిక ఇబ్బందులు పడకుండా జీవనం సాగిస్తున్నట్లు గ్రామానికి చెందిన వృద్ధురాళ్లు మానేపల్లి వరం, సమ్మింగ ఎరుకులమ్మ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కులం, మతం, పార్టీ, వర్గ విచక్ష లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారని డిప్యూటీ సీఎం అన్నారు. సంక్షేమానికి చిరునామాగా... సీఎం జగన్ పాలన సాగుతోందన్నారు. ప్రభుత్వం ద్వారా సీఎం జగన్ అందిస్తున్న తోడ్పాటుతో పేదల కుటుంబాల్లో జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ప్రజలకు అనునిత్యం మంచి చేయాలన్న తపనతో పని చేస్తున్న జగన్ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీ రాజు, వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్, గొర్రుపోటు వెంకటరావు, చీపురపల్లి అచ్చిబాబు, దొగ్గ ఉమాశంకర్, ఆదిరెడ్డి రామునాయుడు, శ్రీకాంత్ శ్రీను, పైల అమ్మాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అల్లు సూర్యనారాయణ, ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

'పది'లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- రాత్రిళ్లు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పర్యవేక్షణ

రోలుగుంట: పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయ బృందం కృషి చేస్తోంది. కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలకు 53 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎం శెట్టి మోహన్ రావు నేతృత్వంలో ఉపాధ్యాయ బృందం ప్రణాళిక తయారు చేసింది. గ్రామాల వారీగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పర్యవేక్షిస్తోంది. జానకీరాంపురం, జె.పి. అగ్రహారం, కుసుర్లపూడి గ్రామాల్లో విద్యార్థుల ఇళ్లకు రాత్రిళ్లు వెళ్లి వారు ఎలా చదువుతున్నారో తెలుసుకుంటోంది. చదివేటప్పుడు వారిలో భయం, ఒత్తిడి నుంచి బయట పడే మార్గాలను విశ్లేషిస్తోంది. సబ్జెక్టు వారీగా వారిలో సందేహాలను నివృత్తి చేసి అవసరమైన సూచనలు చేస్తోంది. ఈ మేరకు గురువారం సోషల్ టీచర్ అప్పన రాంబాబు, ఇంగ్లిష్ టీచర్ సాంబశివరావు, జగ్గారావు తదితరులతో కలసి హెచ్‌ఎం జానకీరాంపురంలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. వారి తల్లిదండ్రులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆశించిన ఫలితాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.



విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తెలుసుకుంటున్న ఉపాధ్యాయ బృందం

దివ్యాంగులకు ప్రత్యేక నిధులు

మాకవరపాలెం: భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్(ఐఈడీ) బి.శకుంతల సందర్శించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద భవిత కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు అందుతున్న విద్యపై ఆరా తీశారు. వారికి ఉపయోగించే బోధనాభ్యసన సామగ్రిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. దివ్యాంగులకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు అందిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకునేలా వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రక్తహీనత నివారణకు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలను వేయించారు. కార్యక్రమంలో ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడుతున్న శకుంతల

బదిలీపై వెళ్తున్న ఏవోకు సన్మానం



ఏవో సూర్యనారాయణను సన్మానిస్తున్న ఆర్డీవో జయరాం, కార్యాలయ సిబ్బంది

నర్సీపట్నం: బదిలీపై వెళ్తున్న ఆర్డీవో కార్యాలయం ఏవో సూర్యనారాయణను ఆర్డీవో హెచ్.వి.జయరాం, సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ఇక్కడ ఏవోకు శ్రీకాకుళం జిల్లా పలాస ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయింది. అక్కడ మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా

- నర్సీపట్నం రూరల్ సీఐ హరి

మాకవరపాలెం: ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని నర్సీపట్నం రూరల్ సీఐ హరి స్పష్టం చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతల విషయమై ఎస్‌ఐ రామకృష్ణారావుతో చర్చించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా వాటి పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి నుంచే సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామ పండగల సందర్భంగా కోడిపందాలు, పేకాట, గుళ్లాటలు నిర్వహిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సీఐ హరి

తహసీల్దార్లు, ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో వెంకటాచార్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు



ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు



ఎంపీడీవో కాళీ ప్రసాద్‌రావును సన్మానిస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల తహసీల్దారుగా సత్యనారాయణ

మాడుగుల: స్థానిక తహసీల్దారుగా టి. సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఎన్నికల బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నుంచి మాడుగుల వచ్చారు. విజయనగరం బదిలీ అయిన ఇక్కడ తహసీల్దారు పీవీరత్నం నుంచి బాధ్యతలు స్వీకరించారు. డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల ఎంపీడీవోగా కాళీప్రసాదరావు

మాడుగుల: స్థానిక ఎంపీడీవోగా ఆర్. కాళీప్రసాదరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఎన్నికల బదిలీపై శ్రీకాకుళం జిల్లా ఎల్.ఎన్.పేట(లక్ష్మీనర్సుపేట) నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువా కప్పి సన్మానించారు. వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనువాస్, ఈవోపీఆర్డీ మీనాకుమారి, ఎంపీడీవో సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాతవరం ఎంపీడీవోగా రాంబాబు

నాతవరం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జె.రాంబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన్ను డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం నుంచి సార్వత్రిక ఎన్నికల బదిలీపై ఇక్కడ నియమించారు. రాంబాబును కార్యాలయ ఏవో పి.పార్థసారథి, ఈవోపీఆర్డీ నరసింహమూర్తి, ఏపీవో చిన్నారావు, ఎంఈవోలు టి.అమృత్ కుమార్, కె.వరహాలబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ మైనం నాగగోపి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

చోడవరం తహసీల్దారుగా వేణుగోపాలరావు

చోడవరం: చోడవరం తహసీల్దార్‌గా పి. వేణుగోపాలరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లా జి.సిగడం మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ తిరుమలబాబు బదిలీపై శ్రీకాకుళం జిల్లాకు వెళ్లారు. నూతన తహసీల్దారుకు రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు పూలబొకేలు ఇచ్చి స్వాగతం పలికారు.

బుచ్చెయ్యపేట ఎంపీడీవోగా వెంకటాచార్య

బుచ్చెయ్యపేట: స్థానిక ఎంపీడీవోగా టీఎస్ వెంకటాచార్య బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చి గురువారం విధుల్లో చేరారు. ఇక్కడ ఎంపీడీవో సువర్ణరాజును అల్లూరి సీతారామరాజు జిల్లా దేవిపట్నం బదిలీ చేశారు. కొత్తగా విధుల్లో చేరిన ఎంపీడీవోకు ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, వడ్డాది ఈవో లవరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరీష్, మండల జేఈ ప్రభు, పంచాయతీ సెక్రటరీ సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు.



తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ



చోడవరం తహసీల్దారు వేణుగోపాలరావు

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

మాడుగుల రూరల్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనదని, గొప్పదని ఎంఈవో -1 డి. పాండురంగారావు అన్నారు. గురువారం జి. అగ్రహారం హైస్కూలులో ఉద్యోగ విరమణ చేసిన ఇంగ్లిషు స్కూలు అసిస్టెంట్ మణికొండ మణి సన్మాన సభ ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం వి. ఉమాశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మణి దంపతులను ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ప్రతినిధులు, ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బి. దేముడమ్మ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు డి. ఆదినారాయణ, వీరనారాయణం హైస్కూలు హెచ్‌ఎం బి.వి.జగన్నాథరావు(బాబి), సర్పంచ్ నందారపు మంగమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఆర్లె మాధవి, నాయుడు పాల్గొన్నారు.



మణి దంపతులను సన్మానిస్తున్న ఎంఈవోలు

బదిలీ అయిన తహసీల్దార్‌కు వీడ్కోలు

మాకవరపాలెం: ఎన్నికల నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ ప్రసాద్ శ్రీకాకుళం బదిలీ అయ్యారు. ఈ మేరకు ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాజారావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ భద్రాచలం, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు బాల, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, జిల్లా కార్యదర్శి నాయుడు, రెవెన్యూ సిబ్బంది గురువారం సాయంత్రం ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. డీటీలు శంకర్, కృష్ణమూర్తి, ఆర్ఐ జెట్టి, సర్వేయరు శ్రీరామ్మూర్తి, వీఆర్వోలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శ్రీకాకుళం జిల్లా హిరమండలం తహసీల్దార్ మురళీ మోహన్‌రావును ప్రసాద్ స్థానంలో నియమించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీరించనున్నారు.



తహసీల్దార్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ, తదితరులు

పోలీసుల తీరుపై ఆగ్రహం



ధర్నా చేస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

మాడుగుల రూరల్: తమ సాగు భూమిలో అక్రమంగా చెట్లను నరికి వేసిన ఏడుగురిపై గతేడాది డిసెంబర్ 30న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఎం. కృష్ణాపురానికి చెందిన యర్రంశెట్టి శ్రీను, తదితరులు ఆగ్రహించారు. ఈ మేరకు దళిత సంఘాలతో కలిసి గురువారం స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. గ్రామంలో సర్వే నంబరు 134-7లో రెండెకరాల డి.ఫారం పట్టా చెట్లను మారాజు అప్పారావు, మరో ఆరుగురు నరికి వేశారని, దీనిపై ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదన్నారు. అయితే కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పి. దామోదర్‌నాయుడు చెప్పడం గమనార్హం. జిల్లా అధ్యక్షుడు వేచలపు సహదేవుడు, కార్యదర్శి రెల్లి తాతరావు, గౌరవాధ్యక్షుడు కె. వెంకటరమణ, ప్రతినిధులు వై. మల్లేశు, బుచ్చిబాబు, కోటి, ఈశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు

- క్షేత్రస్థాయిలో పాడి రైతులకు అవగాహన కల్పించండి
- అల్లూరి పశుసంవర్ధక శాఖ డీడీ నర్సింహులు

రావికమతం: రైతులకు ఆదయాన్నిచ్చే జీవాల పోషణలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను అవలంబించేలా పశువైద్యులు, గోపాల మిత్రలు తగిన సలహాలు, సూచనలివ్వాలని అల్లూరి సీతారామరాజు జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్ నర్సింహులు అన్నారు. మండలంలోని పశువైద్యాధికార్లు, గోపాలమిత్రలతో ఆయన గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులకు వ్యవసాయం తర్వాత అధిక ఆదయాన్నిచ్చేవి కోళ్లు, పాడి పశువులు, గొర్రెలు ఇతర జీవాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయన్నారు. వాటి పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే త్వరితగతిన లాభాలు పొందవచ్చన్నారు. ఆరోగ్య వంతమైన ఉత్పాదక సామర్థ్యం వస్తుందన్నారు. పాడి పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకుతుండటం వల్ల పశువుల ఆరోగ్య చెడిపోవడమే కాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీని నివారణ, టీకాలు వేయించుకునే పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. కొన్ని వ్యాధులు ముదిరితే పశువుల నుంచి మనుషులకు సోకే అవకాశం ఉందన్నారు. కోడి, గొర్రె మాంసాలు పాడైతే వాటి ప్రభావం రైతుపై పడుతుందన్నారు. ఈ దృష్ట్యా రైతులకు సవివరంగా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ పుష్ప తదితరులు పాల్గొన్నారు.



పశువైద్యాధికార్లు, గోపాలమిత్రలకు సూచనలు ఇస్తున్న నర్సింహులు

కిసాన్ రుణాలకు దరఖాస్తులు

చీడికాడ: రైతులకు కిసాన్ క్రెడిట్ రుణాలపై అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరించాలని మాడుగుల పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డా.చిట్టినాయుడు సూచించారు. గురువారం ఆయన చీడికాడలో పశువైద్య సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. రైతు భరోసా అందుకుంటున్న రైతులు, డ్వాక్రా, వ్యవసాయ రుణాలు పొందుతున్న వారు కిసాన్ క్రెడిట్ రుణాలకు అర్హులన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో సిబ్బంది రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. తక్కువ వడ్డీకి రుణాలు ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యులు గాయిత్రి దేవి, రాఘవమ్మ, గణేష్ పాల్గొన్నారు.



పశు వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న చిట్టినాయుడు

సీపీఎం పోరాట నిధి సేకరణ

నర్సీపట్నం : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.కోటేశ్వరావు పిలుపునిచ్చారు. బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూ ముద్రించిన కరపత్రాలను గురువారం పట్టణంలో పంపిణీ చేసి, పోరాట నిధిని సమీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలు ఉపాధి అవకాశాలు కోల్పోయారన్నారు. నిత్యావసర సరకుల ధరలకు అదుపులేదన్నారు. విభజన హామీలు అమలు చేసి రాష్ట్రాన్ని ఆదుకోవాలన్నారు. ప్రజల కోసం నిరంతరం పోరాడే సీపీఎంకు విరాళాలు ఇచ్చి ఆదరించాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఈరెల్లి చిరంజీవి, ఈశ్వరరావు, శివ, నాగమణి పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

కె.కోటపాడు: రొంగలి నాయుడుపాలెంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. అనారోగ్య సమస్యలు గల వారు ప్రత్యేక వైద్య శిబిరంలో సేవలు పొందాలన్నారు. నలుగురు ప్రత్యేక వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేస్తారన్నారు.